7న ఉట్నూర్‌లో ఏఎస్‌పీ అత్యవసర సమావేశం

ఉట్నూర్, జూలై5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పూనెంశ్రీనివాస్ ఆధ్వర్యంలో అత్యవసర రాష్ట్ర స్థాయి సమావేశం ఉట్నూర్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి సెడ్మకి రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడతో పాటు నాయకులు ఉట్నూర్‌లోని ఆదివాసీ భవన్‌లో జరగనున్న సమావేశానికి హాజరు అవుతున్నారు అన్నారు. ఆదివాసీ చట్టాలు, హక్కుల అమలు న్యాయం పోరాటాలు, సంఘ విస్తరణ, ప్రస్తుత పరిస్థితి,మొదలగు విషయాల గురించి చర్చించనున్నామన్నారు.



జూలై 30 డెడ్‌లైన్

- నామినేట్ పదవుల కోసం కాంగ్రెస్‌లో పోటాపోటీ
- తాజాగా అధిష్ఠానం ప్రకటనతో మళ్లీ చిగురిస్తున్న ఆశలు
- డీసీసీ, మార్కెట్ కమిటీ పదవులపై పలువురు నేతల కన్ను
- మల్లికార్జున్ ఖర్గే దిశా నిర్దేశంతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్

ఆదిలాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పార్టీ పదవులతో పాటు నామినెట్ పదవులను భర్తీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ డెడ్‌లైన్‌ను విధించింది. జూలై 30లోపు అన్ని రకాల నామినెట్ పదవులను నియమించాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే ఆదేశించారు. దీంతో ఆశావాహ నేతల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. దశాబ్దా కాలం తర్వాత అధికారంలోకి వచ్చినా జిల్లాలో కాంగ్రెస్ పార్టీని ముందుకు నడిపించే నాయకత్వమే లేకుండా పోయింది. గత రెండేళ్లుగా ఇదిగో అదిగో అంటూ అధిష్ఠానం పెద్దలు కాలం గడుపుతూ వస్తున్నారు. డీసీసీ లేకుండానే పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికలను నెట్టుకొచ్చారు. ఈ రెండు ఎన్నికల్లోనూ పార్టీ ఓటమి పాలయ్యింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీ అభ్యర్థులనే నియోజకవర్గ ఇన్‌చార్జీలుగా నియమించి పార్టీ వ్యవహారాలను కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత జిల్లాకు పెద్దగా నామినేట్ పదవులను కేటాయించ లేదు. దీంతో డీసీసీ అధ్యక్ష పదవితో పాటు ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్, రాష్ట్ర విజయ డెయిరీ చైర్మన్ ఖాళీగానే కనిపిస్తున్నాయి. ఈ పదవులపై పలువురు నేతలు భారీ ఆశలు పెట్టుకుంటున్నా అధిష్ఠానం మాత్రం ఊరిస్తూనే వస్తోంది. తాజాగా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గేనే స్వయంగా హైదరాబాద్ బహిరంగ సభలో నామినేట్ పదవులను వెంటనే భర్తీ చేయాలని ఆదేశించడంతో కాంగ్రెస్‌లో మళ్లీ కదలిక మొదలయ్యింది. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే నామినేట్ పదవుల భర్తీని చేపట్టే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే మల్లికార్జున్ ఖర్గే పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయడంతో కాంగ్రెస్‌లో జోష్ కనిపిస్తోంది.

నామినెట్ పదవుల కోసం కాంగ్రెస్‌లో పోటాపోటీ

గతంలోనే నామినెట్ పదవుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా నేతల మధ్య వర్గ విభేదాలు తలెత్తడంతో తలనొప్పిగా మారింది. దీంతో ఇన్నాళ్లు నామినేట్ పదవుల జోలికి వెళ్లనే లేదు. ఆశావాహ నేతలు పలుమార్లు అధిష్ఠానం పెద్దల దృష్టికి తీసుకెళ్లినా ఇదిగో అదిగో అంటూ హామీలు ఇస్తూ వచ్చారు. పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉన్న నేతలంతా పార్టీ అధికారంలోకి రాగానే పదవుల కోసం ఆరాట పడుతున్నారు. గత కొన్నాళ్లుగా పదవుల కోసం పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో నేతల మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. అగ్ర నేతలు పర్యటించిన సమయంలోనూ జిల్లా నేతల మధ్య విభేదాలు బయట పడుతున్నాయి. ఒకరిపై ఒకరు అధిష్ఠానానికి పోటాపోటీగా ఫిర్యాదులు చేసుకోవడం విభేదాలకు మరింత కారణమవుతోంది.

గాడ్‌ఫాదర్ల వద్దకు పరుగులు

ఈ సారి నామినేట్ పదవులను భర్తీ చేయడం ఖాయంగానే కనిపించడంతో ఆశావాహ నేతలు తమ తమ గాడ్‌ఫాదర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి వెళ్లిన నేతలు అక్కడే మకాంవేసి నామినేట్ పదవులను దక్కించుకునేందుకు లాబీయింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. జాతీయ అధ్యక్షుడు ఖర్గే స్పష్టమైన ప్రకటన చేయడంతో ఆశావాహ నేతల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఎలాగైనా నామినేట్ పదవులను దక్కించుకునేందుకు జిల్లా నేతలు అధిష్ఠానం పెద్దల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. పార్టీలో తమకున్న పరిచయాలతో పాటు అగ్రనేతల అండతో చక్రం తిప్పుతున్నారు. అయితే జిల్లా ఇన్‌చార్జి మంత్రితో పాటు ఎమ్మెల్యేలు నియోజకవర్గ ఇన్‌చార్జీల ఆమోదం తప్పనిసరిగా కనిపిస్తోంది. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో గ్రూపు విభేదాలు కనిపిస్తున్నాయి. ఒకరికి పదవి దక్కితే మరొకరు అసంతృప్తికి గురయ్యే అవకాశం కనిపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు పార్టీలో విభేదాలు నెలకొంటే విజయ అవకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉందంటున్నారు. ఈ నెల చివరి వరకు నామినేట్ పదవులను కేటాయించేందుకు కసరత్తు మొదలు పెట్టడంతో ఆశావాహ నేతలు అధిష్ఠానం నిర్ణయం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

డీసీసీ రేసులో ఐదుగురు నేతలు

జిల్లా డీసీసీ రేసులో పలువురు నేతలు ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీ అధికారంలో ఉండడంతో డీసీసీకి మరింత ప్రాధాన్యత కనిస్తోంది. దీంతో పదవిని దక్కించుకునేందుకు నేతలు పట్టుదలతో కనిపిస్తున్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ సోయంబాపురావు, గోక గణేష్‌రెడ్డి, బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, మల్లెపూల సత్యనారాయణల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అయితే నేతలంతా ఎవరికి వారే ధీమాగా కనిపిస్తున్నా చివరికి అధిష్ఠానం ఎవరివైపు మొగ్గు చూపుతుందోనన్న ఆసక్తి నెలకొంది. ఓసీ సామాజిక వర్గం నుంచి ముగ్గురు నేతలు పోటీ పడుతుండగా బీసీ సామాజిక వర్గం నుంచి ఒకరు, ఎస్టీ సామాజిక వర్గం నుంచి మరొకరు డీసీసీ పదవిని ఆశిస్తున్న వారిలో ఉన్నారు. ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఇప్పటి వరకు ఎవరి పేరు ప్రధానంగా వినిపించడం లేదు. అయితే ఈ సామాజిక వర్గం నుంచి కూడా ఒకరిద్దరు డీసీసీ బరిలో నిలిచే అవకాశం కనిపిస్తోంది. అలాగే ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై ఇంకా సస్పెన్షన్ కొనసాగుతోంది. ఇప్పటికే ఒకరిద్దరు పేర్లను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించినా పార్టీలో అభ్యంతరాలు రావడంతో అర్థాంతరంగానే నిలిపి వేశారు. సీనియర్, జూనియర్ల వివాదం తలెత్తడంతో ప్రభుత్వం మార్కెట్ కమిటీ జోలికి వెళ్లినట్లు కనిపించడం లేదు. ఈ సారి మాత్రం మార్కెట్ కమిటీ నియామకానికి ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

నకిలీ స్టాంప్ పేపర్ల తయారీ ముఠా గుట్టురట్టు

- వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, జూలై5 (ఆంధ్రజ్యోతి) :డాక్యుమెంట్ రైటర్ ముసుగులో నకిలీ స్టాంపులు, పత్రాలను తయారు చేసి విక్రయించిన తండ్రి కొడుకులను ఆదిలాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీకి చెందిన తండ్రికొడుకులు ఏ1 లాడ్వేరాహుల్‌కుమార్, ఏ2 లాడ్వే భద్రినాథ్‌లు గత కొంత కాలంగా ప్రభుత్వ శాఖలకు సంబంధించిన నకిలీ పత్రాలు, నకిలీ స్టాంపు పేపర్లను తయారు చేస్తూ విక్రయిస్తున్నారని తెలిపారు.నకిలీ పత్రాలతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న నిందితులను పక్కా సమాచారంతో దాడి చేసి నిందితులను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ప్రధానంగా రెవెన్యూ శాఖ పరిధిలోని సర్వే నెంబర్ 170 లోని ప్లాట్ల పత్రాలను రెవెన్యూ అధికారులు కేటాయించినట్లుగా నకిలీ పత్రాలను సృష్టించడం జరిగిందన్నారు. అలాగే మున్సిపల్‌కు సంబంధించిన ట్రేడ్ లైసెన్స్ పత్రాలు, పోలీసు డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన వాహన రిలీజ్ పత్రాలు, ఆధార్‌కార్డులు, గ్రామ పంచాయతీ బిల్డింగ్ పర్మిషన్లు, వివిధ ఆసుపత్రులకు సంబంధించిన నకిలీ డాక్యుమెంట్లు, నకిలీ బర్త్, డెత్ సర్టిఫికేట్లు, నకిలీ వివాహ సర్టిఫికేట్లను సృష్టించడంలో తండ్రి కొడుకులు ఆరి తేలినట్లు తెలిపారు. ఆదిలాబాద్ ఒకటవ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా అసలు విషయం బయట పడిందన్నారు. దీంతో తండ్రి లాడ్వే భద్రినాథ్‌ను అరెస్టు చేయగా కొడుకు లాడ్వేరాహుల్‌కుమార్ పరారీలో ఉన్నాడని పేర్కొన్నారు. నిందితుల నుంచి నకిలీ స్టాంపులు తయారు చేసే రసాయనాలు, ఎక్స్‌రే పేపర్లు, స్టాంపు పరికరాలు, కంప్యూటర్, హార్డ్‌డిస్కులను స్వాధీనం చేసుకున్నామన్నారు. వివిధ జిల్లాల్లో వివిధ శాఖలకు సంబంధించిన నకిలీ స్టాంపులు, అధికారుల సంతకాలతో కూడిన పత్రాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.నకిలీ పత్రాలను సృష్టించి భూ వివాదాలకు కారణమయ్యారని, నకిలీ పత్రాల ద్వారా పలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందినట్లు గుర్తించామన్నారు. ఫేక్ పత్రాల ద్వారా లబ్ధిపొందిన వారి పై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేసుదర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, వన్‌టౌన్ సీఐ బి.సునీల్‌లను ఎస్పీ అఖిల్‌మహాజన్ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ పోలీసుకు క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరి

ఆదిలాబాద్ :ప్రతిఒక్కరు క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, విధులలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన పరేడ్‌లో జిల్లా ఎస్పీ పాల్గొని సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ప్రతిరోజు వ్యాయామం నిర్వహిస్తూ శారీరక ధృడత్వాన్ని కలిగి ఉండాలని తెలిపారు. సిబ్బంది ప్రతిరోజు వ్యాయమం చేయాలని, ప్రతి శనివారం నిర్వహించే పరేడ్‌లో పాల్గొని పోలీసు నిర్వహించే కవాతులో పరిపూర్ణత చెందాలని సూచించారు. డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీఐలు బి.సునిల్‌కుమార్, ప్రేమ్‌కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి.వెంకటి, టి.మురళి, ఎన్.చంద్రశేఖర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు,రిజర్వ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి



విన్నుతా, విధాత్‌లు (ఫైల్)

- మృతులు అక్కా తమ్ముడు

మావల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నీటిగుంతలో పడి అక్కా, తమ్ముడు మృతిచెందిన విషాదఘటన ఆదిలా బాద్ జిల్లా మావల మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మావల పోలీసులు, గ్రామస్తులు తెలి పిన వివరాల ప్రకారం మావల మండల కేంద్రానికి చెందిన లంక స్వామి దంపతులు వ్యవసాయం చేస్తుంటారు. వారికి విన్నుతా, (11), విధాత్ (9) పిల్లలు. శనివారం పాఠశాలకు వెళ్లకుండా వారి వ్యవసాయ భూమి సమీపంలో ఆడుకుంటున్నారు. అయితే ఎప్పటిలాగే వ్యవసాయం పనులకు వెళ్లి తల్లిదండ్రులు పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో విన్నుతా, విధాత్‌లు సైకిల్ నడుపుతూ ప్రమాదవశాత్తు నీటిగుంటలో పడ్డారు. పిల్లలు కనిపించకపోవడంతో ఇంటికి వెళ్ళారేమో ఆరా తీశారు. ఇంటివద్ద లేరని తెలుసుకొని వ్యవసాయ భూమి పరిస రాల్లో వెతకగా నీటి గుంటలో పడి ఉన్నారు. సమాచారం అందుకున్న మావల పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని చిన్నారులను వెలికితిశారు. కాగా అప్పటికే ఆ చిన్నారులు మృతి చెందారు. పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాలను రిమ్స్‌కు తరలించారు. సెలవుల్లో పిల్లలు ఆడుకుంటారని వారి మొహాల్లో ఆనందం చూసి మురుస్తానని తండ్రి లంక స్వామి వారికీ శుక్రవారం సైకిల్ కొనిచ్చాడు. సైకిల్‌లే వారి పాలిట యమపాశం అవుతుందని ఆ తండ్రి ఊహించి ఉండడు. ఆ సైకిల్‌తోనే నీటి గుంటలో పడి చిన్నారులు మృతి చెందిన సంఘటనతో మావలలో అంతులేని విషాదం నెలకొంది. చిన్నారుల మృతి పట్ల తల్లిదండ్రుల, కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

ఆధ్యాత్మిక కేంద్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

బోథ్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక కేంద్రాలను నిర్మల్ డిపో నుంచి ఆర్టీసీ బస్సులను నడపడానికి డిపో మేనేజర్ పండరి పేర్కొన్నారు. నిర్మల్ డిపో నుంచి కాణిపాకం, అరుణాచలం కలసి పాతాళ శంభో మధుర మీనాక్షి రామేశ్వరం, శ్రీరంగం, భద్రాచలం, అన్నవరం, శ్రీశైలం క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నామన్నారు. గురుపౌర్ణమి ఉన్నందున అరుణాచలం గిరి ప్రదక్షిణ కోసం వెళ్లే భక్తులకు నిర్మల్ నుండి 9వ తేదీన మధ్యాహ్నం ఒంటిగంటకు అరుణాచలం బస్సు వెళుతుందన్నారు. ఈ బస్సు పదవ తేదీ ఉదయం 7 గంటలకు కాణిపా కం చేరుకుంటున్నారు. వరాహసిద్ధి వినాయక దర్శనం అనంతరం నెల్లూ రులోని గోల్డెన్ టెంపుల్ సాయంత్రం అరుణాచలం చేరుతుందన్నారు. గద్వాల్ జిల్లా అలంపూర్ జోగులాంబ దర్శనం చేసుకున్న తర్వాత నిర్మల్ చేరుకుంటుందని వివరించారు. ఒక్కొక్కరికి 6,900 చార్జిగా ఉంటుందని వివరించారు. భోజన ఖర్చు, వసతి ప్రయాణికుల దేనని పేర్కొన్నారు. బయలుదేరి కాణిపాకం అరుణాచలం అతని పాపాల శంభు కరంగిల్ మాల మధుర మీనాక్షి, రామేశ్వరం, శ్రీరంగం, రంగనాయక, విష్ణుమూర్తి దర్శనం చేసుకొని 21న సాయంత్రం నిర్మల్ చేరుకుంటుందని ఏడు వేల 500 ప్యాకేజీగా ఉందని తెలిపారు. భోజన వసతి ప్రయాణికులదేనని తెలిపారు. శ్రీశైలం ఆలయానికి జూలై 9న రాత్రి 8 గంటలకు శ్రీశైలం బస్సు నడుపుతున్నామన్నారు. ఇక్కడి నుండి వెళ్లిన బస్సు తెల్లవారు శ్రీశైలం చేరుకుంటుందని పేర్కొన్నారు.

విద్యుత్ లైన్‌ను సరిచేయాలి



అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జేహెర్‌చౌహన్

ఆదిలాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ సర్కిల్‌లోని అధికారులతో సర్కిల్ రివ్యూ మీటింగ్‌ను సీఈ/కన్‌స్ట్రక్షన్ ఇన్‌చార్జీ సూపరింటెండెంట్ ఇంజనీర్ జేఆర్ చౌహాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదకరంగా ఉన్న వంగిన విద్యుత్‌పోల్స్, వదులుగా ఉన్న లైన్స్, ఎత్తు తక్కువగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ గద్దెలు, తక్కువ ఎత్తు ఉన్న లైన్స్‌ను గుర్తించి వెంటనే సరి చేయాలని సూచించారు. 33కేవీ, 11కేవీ లైన్స్ పెట్రోలింగ్ చేసి సమస్యలను గుర్తించి వాటిని సరి చేసి అంతరాయాలను తగ్గించాలన్నారు. డిష్ కేబుల్, ఇంటర్నెట్ కేబుల్ ఆపరేటర్స్ వాడుతున్న పోల్ చార్జెస్‌కట్టని వారి నుంచి వెంటనే వసూలు చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అగ్రికల్చర్ సర్వీసులు వెంటనే రిలీజ్ చేయాలని, అన్ని మండలాల అసిస్టెంట్ ఇంజనీర్స్ అన్ని కేటగిరిస్ పెండింగ్ బిల్లులు వందశాతం వసూలు చేయాలని తెలిపారు. డివిజనల్ ఇంజనీర్స్, అకౌంట్స్ ఆఫీసర్స్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, సబ్ ఇంజనీర్స్ పాల్గొన్నారు.

అవగాహనతోనే వ్యాధులను అరికట్టవచ్చు

- జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సుమలత

తలమడుగు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే వ్యాధులను అరికట్టవచ్చని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సుమలత అన్నారు. శనివారం మండలంలోని రుయాడి గ్రామంలో క్షయ వ్యాధి నివారణ వ్యాధిపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధి నివారణ కొరకు ప్రజలు తీసుకోవాల్సినటువంటి జాగ్రత్తల కోసం శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అతి దగ్గు, బరువు తగ్గడం, రెండు వారాలకు మించి జ్వరం, దీర్ఘకాలిక సంబంధిత బాధపడుతున్న వారందరూ క్షయ నివారణ పరీక్షలు చేయించుకోవాలని తెలియజేయడం జరిగింది. క్షయ నివారణకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం ముందు నిర్వహించిన వైద్య శిబిరాన్ని సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ లోక భూమ రెడ్డి, మాజీ సర్పంచ్ పోతా రెడ్డి, గ్రామస్తులు సుదర్శన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మోతే గంగాధర్, హెల్త్ సూపర్‌వైజర్ నాగభూషణం, నవీద్, టిబి ఆల్ట్‌ఏసీఎఫ్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ తిరుపతి, గ్రామస్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అనంతరం హసన్ హుస్సేన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భూ కబ్జా కేసులో ఐదుగురి అరెస్టు

- వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ డీఎస్పీ



వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ డీఎస్పీ

మావల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): భూ అక్రమాలపై జిల్లా పోలీస్ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతున్నామని, బాధితులకు ఎలాంటి సమస్య ఉన్న జిల్లా పోలీస్ యం త్రాంగాన్ని సంప్రదించాలని డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి పేర్కొ న్నారు. శనివారం మావల పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలో భూ కబ్జాలు చేస్తూ బెదిరింపులకు పాల్పడిన 9 మందిపై కేసు నమోదు చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఖానాపూర్ ప్రాంతంలోని భూముల పత్రాలను ఫోర్జరీ చేసి, ప్లాట్లను ఆక్రమించి, డబ్బు చేస్తూ నిజమైన ఆస్తి యజమానులకు బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపారు. 2009లో జనకొండ పోసాని కొనుగోలు చేసిన ప్లాట్లను నిందితులు తప్పుడు పత్రాలతో ఆక్రమించారు. మున్సిపల్ అధికారులను మోసం చేసి ఇంటి నంబర్లను పొందారు.కాగా జూలై 17, 2023న ఫిర్యాదు నుండి 1,00,000 వసూలు చేసి, తప్పుడు ప్రభుత్వ భూమి పత్రాలను అప్పగించారు. ఈ ముఠా ఖాళీ ప్లాట్లను గుర్తించి, నకిలీ పత్రాలు సృష్టించి సులభంగా డబ్బు సంపాదించడం అలవాటు చేసుకున్నారని విచారణలో తేలిందన్నారు. తప్పుడు పత్రాలు కలిగిన ప్లాట్లను పోలీసులు దర్యాప్తు చేసి, తప్పుడు ఇంటి నంబర్లు, ప్రభుత్వ భూమికి సంబంధించిన నకిలీ పత్రాలను ధృవీకరించారన్నారు. ఈ మేరకు ఫైక్ రావు ఆనంద్, సద్దాం, షేక్ షాదుల్లా, బోడకుంట్ల రాజు, షేక్ అజీముద్దీన్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మిగిలిన నలుగురు నిందితులు సంతోష్, మనోహర్, షాబానా బేగం, హీనా అంజుమ్) పరారీలో ఉండగా, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ఇటువంటి మోసపూరిత కార్యకలాపాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ప్లాట్‌హౌస్ నెంబర్‌కు సహకరించిన మున్సిపల్ సిబ్బంది రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుదర్శన్, రెవెన్యూ ఆఫీసర్ జాదవ్, కృష్ణ లపై కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మావల ఎస్‌హెచ్‌ఓ సీఐ స్వామి, ఎస్సై ముజాహిద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సొంత జిల్లాల్లో ఎంపీడీఓల పోస్టింగ్‌లు

ఆదిలాబాద్, జూలై5 (ఆంధ్రజ్యోతి) : 2024 పార్లమెంట్ ఎన్నికల విధుల్లో భాగంగా ఇతర జిల్లాలకు వెళ్లిన ఎంపీడీఓలను ఎట్టకేలకు శనివారం ప్రభుత్వం తిరిగి సొంత జిల్లాలకు పోస్టింగ్‌లు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సుమారుగా 16 నెలల తర్వాత ఎంపీడీఓలకు తిరిగి పోస్టింగ్‌లు ఇవ్వడంతో హర్షం వ్యక్తమవుతుంది. దూర ప్రాంతాలకు వెళ్లలేక కొంత మంది ఎంపీడీఓలు దీర్ఘకాలిక సెలవుల్లోనే కొనసాగుతున్నారు. ప్రభుత్వం తాజాగా సొంత జిల్లాలకే పోస్టింగ్‌లు ఇవ్వడంతో విధుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.ఇది వరకే ఆప్షన్స్ ఇచ్చిన వారికి మాత్రమే ప్రభుత్వం బదిలీలకు అవకాశం కల్పించినట్లు తెలుస్తుంది. ఒకరు మాత్రమే జిల్లాకు రాగా ఐదుగురు ఎంపీడీఓలు జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. ఉమ్మడి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఎక్కువ మంది ఎంపీడీఓలు సొంత జిల్లాల్లో పోస్టింగ్ దక్కే అవకాశం లేక పోవడంతో ఆప్షన్ ఇచ్చేందుకు ఆసక్తి చూపలేదని తెలుస్తుంది.

అధికారి పేరు	ప్రస్తుతజిల్లా	పోస్టింగ్
1. ఎ.భూమయ్య	మంచిర్యాల	ఆదిలాబాద్
2. మహమ్మద్‌అబ్దుల్	ఆదిలాబాద్	మంచిర్యాల
3. కె.నాగేశ్వర్‌రెడ్డి	ఆదిలాబాద్	మంచిర్యాల
4. ఎ.రవీంద్రనాథ్	ఆదిలాబాద్	జయశంకర్
5. కె.లక్ష్మణ్	ఆదిలాబాద్	నిజామాబాద్
6. కె.రాజ్‌వీర్	ఆదిలాబాద్	

నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికే జాబ్ మేళా



మాట్లాడుతున్న జేడీఎం నాగభూషణం

ఇంద్రవెల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు హైదరాబాద్‌లోని వివిధ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించడానికే సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతుందని, సమగ్ర గిరిజానాభివృద్ధి సంస్థ ఉట్నూర్ జేడీఎం నాగభూషణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన మినీ జాబ్‌మేళా కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా 130 మంది నిరుద్యోగ యువతి, యువకులు హాజరు కాగా జీ4 కంపెనీలో సెక్యూరిటీ గార్డులుగా 28 మంది, కేఎల్ గ్రూప్ కంపెనీలో వివిధ పనులకు 24 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగింది. మిగిలిన నిరుద్యోగులకు వివిధ స్వయం ఉపాధి శిక్షణ కోర్సులకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ద్వారా నిరంతరం జాబ్‌మేళాలు నిర్వహించి నిరుద్యోగులకు వివిధ కంపెనీలో ఉద్యోగాలు కల్పించడంతో పాటు ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ఉపాధి మార్గాలను చూపించడానికి కృషి చేయడం జరుగుతుందని అన్నారు. యువతి యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీపీఎం మల్లేష్, ఏపీఎం రామారావు, హెచ్‌ఆర్ ప్లేస్మెంట్ మేనేజర్ వినోద్, సురేందర్, జేఆర్‌పీ సంజీవ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నేడు మొహరం పండుగ

తలమడుగు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యాలకు అతీతంగా జరుపుకునే మొహరం పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు తలమడుగు మండలంలో రుయ్యాడిలో ఆలయ కమిటీ అధ్యక్షులు లోక భూమారెడ్డి, కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఏర్పాట్లు చేపట్టారు. రుయ్యడి గ్రామలో పీరిలకు ఘనమైన చరిత్ర ఉండడంతో ఇక్కడ పండుగను గ్రామస్తులంతా కలిసి ఘనంగా నిర్వహిస్తారు. గ్రామంలోని హసేన్ హుసేన్ ఆలయం వద్ద గుండము తవ్వి అందులో నిప్పులు ఏర్పాటు చేసి గుండం చుట్టు ప్రతిరోజు రాత్రి అచ్చదుల హారతి అంటూ కోలాటం ఆడుతారు. అదేవిధంగా ఆలయంలో అదేవిధంగా ఆదివారం రోజున నిర్వహించే మొహరం పండుగ మలిదల పండుగకు ఏర్పాట్లు చేపట్టడం జరిగిందన్నారు. పీరీలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు, పీరులకు రంగురంగుల వస్త్రాలు ధరించి భాజ భాజా భజంత్రీలతో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అదేవిధంగా మండలంలోని తలమడుగు బరంపూర్, సుంకిడి, దేవాపూర్, కుచలాపూర్ తదితర గ్రామాల్లో ఈ పండుగను ఘనంగా నిర్వహిస్తారు.

వైద్య సిబ్బంది అప్రమత్తతే ముఖ్యం

ఇచ్చోడ, జూలై5 (ఆంధ్రజ్యోతి):వ్యాధుల కాలం కావడంతో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు డీఎంహెచ్‌ఓ మనోహర్ సూచించారు. శనివారం ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్యా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య కేంద్రం, పరిసర ప్రాంతాలను పరిశీలించారు.అనంతరం ఆసుపత్రిలో పలు దస్త్రాలను పరిశీలించి మందుల వివరాల పై ఆరా తీశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రభలే ప్రమాదముందని, గ్రామాల్లో సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యురాలు మధురిమ ఉన్నారు.

దరఖాస్తుల వెల్లువ

బోథ్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఎంపీడీవో రమేష్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారులు వివిధ రకాల సబ్సిడీలు రావడంలేదని 33 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఎక్కువమందికి గ్యాస్, విద్యుత్‌కు సంబంధించిన సబ్సిడీలు రావడం లేదన్నారు నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం కింద ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన మాజీ ఎంపీ



రాష్ట్ర మంత్రులలను సన్మానిస్తున్న మాజీ ఎంపీ, నియోజక వర్గ ఇన్‌చార్జీ

ఆదిలాబాద్, జూలై5 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మాజీ ఎంపీ సోయం బాపురావ్ తన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి సత్కరించారు. అనంతరం బోథ్ నియోజక వర్గానికి అదనంగా 500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని మంత్రిని కోరగా దీంతో మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మాజీ ఎంపీ తెలిపారు. బోథ్ నియోజక వర్గ ప్రజల తరఫున మాజీ ఎంపీ సోయంబాపురావు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎంపీ సోయంబాపురావు కుమారుడు సోయం వెంకటేశ్ ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి అండ్ మత్స్యకార, క్రీడలు, యువజన సేవల మంత్రి వాకిటి శ్రీహరిని హైదరాబాద్‌లో తన చాంబర్‌లో మాజీ ఎంపీ సోయంబాపురావ్,ఆదిలాబాద్ అసెంబ్లి నియోజక వర్గ ఇన్‌చార్జీ కందిశ్రీనివాస్‌రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిశారు.

'భవనాన్ని ప్రారంభించడం సంతోషం'



మాజీ మంత్రిని సన్మానిస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్, జూలై5 (ఆంధ్రజ్యోతి):నిరుపేదలు వైద్యం కోసం పడుతున్న ఇబ్బందులను ప్రజా ప్రతినిధులు పట్టించుకోక పోయిన అధికార యంత్రాంగం చొరవ చూపి బేల పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభించడం అభినందనీయమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న అన్నారు. జిల్లా అధికారులు పీహెచ్‌సీ భవనాన్ని ఇటీవల ప్రారంభించడంతో బీఆర్ఎస్ నేతలతో కలిసి మాజీ మంత్రి భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో తిరుగుతు పనుల తీరును పర్యవేక్షించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కోటి యాభై ఆరు లక్షల నిధులతో నూతన భవనం నిర్మించుకోవడం జరిగిందన్నారు. నిర్మాణ పనులు పూర్తియి యేడాది గడుస్తున్నా స్థానిక నేతలకు ప్రారంభించేందుకు సమయం లేక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. బీఆర్ఎస్ నేతలు జిల్లా అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో స్పందించి భవనాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. నూతన భవనంలో కొత్త పరికరాలు అందుబాటులోకి తీసుకు రావాలని, అదనపు సిబ్బందిని సైతం కేటాయించాలని కోరారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు ప్రమోద్‌రెడ్డి, నాయకులు దేవన్న, గంబీర్‌ఠాక్రె, సతీష్‌పవార్, జక్కుల మధుకర్, మస్కేతేజ్‌రావ్, కిషన్‌వైద్య, మంగేశ్‌ఠాక్రే తదితరులు పాల్గొన్నారు.

గ్రామసంఘాల అంతర్గత ఆడిట్ పూర్తి

జైనథ్, జూలై5 (ఆంధ్రజ్యోతి): జైనథ్ మండల సమాఖ్య పరిధిలో గల 42 గ్రామ సంఘాల ఆడిట్‌లను శనివారం పూర్తి చేసినట్లు ఇందిరమ్మ మండల సమాఖ్య ఏపీఎం భగవండ్లు తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధిత ఆర్థిక లావాదేవీ లపై జమ, ఖర్చుల పై ఆడిట్‌లు పారదర్శకంగా చేపట్టినట్లు తెలిపారు. ఆడిట్ నిర్వహించిన వారిలో సీబీఓ ఆడిటర్లు రాజేందర్, గంగాధర్లతో పాటు సీసీలు నాందేవ్, ఎల్‌టీ వెంకటరెడ్డి, టి.శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

'పోడురైతుల జోలికి వస్తే ఎంతకైనా తెగిస్తాం'



రోడ్డుపై బైఠాయించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండలంలోని కేశవ్ పట్నం, బాబ్జి పెట్ పోడు రైతులను అటవీ అధికారులు గత కొన్ని రోజులుగా ఇబ్బందులు పెడుతున్న విషయం రైతులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దృష్టికి తీసుకెళ్లగా శనివారం బాబ్జి పెట్ వద్ద ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్వయంగా రైతులతో రోడ్డుపై బైఠాయించారు. వచ్చేది మన కేసీఆర్ ప్రభుత్వమే అందరికి పోడు పట్టాలు అందిస్తామని అన్నారు. అటవీ అధికారులకు మాట్లాడుతూ పోడు రైతులను ఇబ్బందులు పెడితే సహించబోమని అవసరం అయితే రైతుల కోసం ఎంతకైనా తెగిస్తామని అన్నారు. వెంటనే రైతులను ఇబ్బందులు పెట్టడం మానేసి వెనక్కి వెళ్లిపోవాలని మందలించారు. అటవీ అధికారులు వినని యెడల రోడ్డుపైనే ఎమ్మెల్యే బైఠాయించారు. అనంతరం అధికారులను వెనక్కి పంపారు. తమ కోసం రోడ్డుపై బైఠాయించిన ఎమ్మెల్యేపై పోడు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

బోథ్ నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నిధులు మంజూరు చేయించారు. గతంలో నియోజ కవర్గంలోని పలు ఆలయాల మంజూరుకి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాటిచ్చారు. ఈ సందర్భంగా బోథ్ మండలంలోని కౌట బి గ్రామంలో గల మల్లిఖార్జున స్వామి ఆలయ నిర్మాణానికి రూ. 20 లక్షలు, తాంసి మండలం తాంసి బి గ్రామంలో గల శివంబి కేషవ ఆల యానికి రూ. 25 లక్షలు, బోథ్ మండలంలోని మామిడిగూడ హనుమాన్ ఆలయానికి రూ. 12 లక్షలు, అదేవిధంగా గుడిహత్నూర్ మండలం మార్కాపూర్ లో పోచమ్మ ఆలయానికి రూ. 12 లక్షలు, నెరడిగొండ మండలంలోని మాదాపూర్ గ్రామంలో గల అభయ ఆంజనేయ ఆలయానికి రూ. 25 లక్షలు మంజూరు చేయించారు. తాను కోరగానే నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖకు నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 44 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను అందజేశారు. ఇటీవల వెలువడిన లాసెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన రుతికను శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తన నివాసంలో అభినందించారు.

బజార్‌హత్నూర్ :మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన లబ్దిదారులకుక కళాణలక్ష్మి, శాదిముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అందజేశారు.

డీసీసీ అధ్యక్షుడిని పరామర్శించిన ఎమ్మెల్యే బొజ్జుపటేల్



నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్, జూలై5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుని ఖానాపూర్ నియోజక వర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి పై ఆరా తీశారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నిర్మల్ జిల్లా ఇన్‌చార్జీ రాంభూపాల్‌గౌడ్, జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్‌రావు తదితరులున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పీవీటీజీలు కోలాం, తోటీలు, చెంచులు, కొండరెడ్లు ఐటీడీఏ సీసీడీపీ ద్వారా నిర్మించుకున్న ఇండ్ల నిర్మాణ పనులకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న రూ.16.43 కోట్ల నిధుల పెండింగ్ బిల్లులను త్వరగా విడుదల చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ శరత్ కుమార్, ఫైనాన్స్ సెక్రటరీ సందీప్‌కుమార్‌సుల్తానియాను సచివాలయంలోని కార్యాలయంలో కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేక మాట్లాడుతూ పీవీటీజీలు అప్పులు చేసి ఇండ్లను నిర్మించారని, త్వరగా నిధులను విడుదల చేయాలని కోరారు. అనంతరం ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ శరత్‌కుమార్, ఫైనాన్స్ సెక్రటరీ సందీప్‌కుమార్‌సుల్తానియాలు స్పందిస్తూ నెల రోజుల్లోగా నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తామని తెలిపినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్య క్రమంలో జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్‌రావు తదితరులున్నారు.

మావలలో వృద్ధుడి మృతి

● వైద్యుడి నిర్లక్ష్యమని కుటుంబసభ్యుల ఆందోళన

● పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

మావల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ జూనియర్ వైద్యుల నిర్లక్ష్యంతో వృద్ధుడు మృతిచెందినట్లు కుటుంబసభ్యులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. పట్టణంలోని శంకర్ గుట్టకు చెందిన గైక్వాడ్ లక్ష్మణ్ (60) అనే వృద్ధుడి కాలికి గాయం కావడంతో వాపు వచ్చింది. దీంతో కుటుంబీకులు శుక్రవారం రిమ్స్ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. అయితే రిమ్స్‌లోని జూనియర్ డాక్టర్లు ఎటువంటి వైద్య చికిత్సలు చేయకుండా ఫోనలో సీనియర్ డాక్టర్ల సలహాలతో వారు చెప్పినట్లు నిర్లక్ష్యంగా వైద్యం చేయడంతోనే అధిక రక్త స్రావమై వృద్ధుడు మృతి చెందినట్లు కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతులు సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు వెళ్లేలా కృషి

బోథ్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తన పరిధిలోని రైతులు వ్యవసాయాన్ని సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అధునాతన పద్ధతిలో వ్యవసాయం చేసే విధంగా కృషి చేస్తానని ఆత్మ చైర్మన్ జి.రాజు యాదవ్ పేర్కొన్నారు. బోథ్ ఆత్మ చైర్మన్‌గా నియామకం జరిగిన అనంతరం మొదటిసారిగా విలేకరులతో మాట్లాడారు. సూక్ష్మ నీటిపారుదల భూసార పరీక్షలు యంత్ర లక్ష్మీ కంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు రైతులకు అందే విధంగా చేస్తామని పేర్కొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ సహకార వారోత్సవాలు

తలమడుగు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శనివారం ఘనంగా అంతర్జాతీయ సహకార సంఘ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో మోతి శ్రీనివాస్ మాట్లాడుతూ సహకార సంఘాలతోనే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. సహకార సం ఘాల ద్వారా రైతులకు రుణాలు, ఎరువుల పంపిణీ రైతులు పండించిన పంటను కొను గోలు చేయడం ద్వారా రైతులకు సంఘాల ద్వారా ఎంతో సహకారం అందుతుందన్నారు.

అర్ధరాత్రి చెట్ల తొలగింపు

● తిరిగి మొక్కలు నాటిన ఎంపీడీవో రాధా రాథోడ్



చెట్లను తొలగించి చదును చేసిన దృశ్యం

లక్ష్మణచాంద, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోరిగాం గ్రామంలో గల పల్లె ప్రకృతివనానికి సంబంధించిన ఎకరం స్థలంలో గల చెట్లను శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని కొందరు వ్యక్తులు జేసీబీ యంత్రంతో చెట్లను తొలగించి భూమిని చదును చేశారు. ఈ విషయాన్ని శనివారం ఉదయం గమనించిన బోరింగా తండా వాసులు ఆ స్థలం వద్దకు వెళ్లి ఆందోళన నిర్వహించారు. ఎంపీడీవో రాధా రాథోడ్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. బోరిగాం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మరికొందరితో కలిసి ఈ చెట్లను తొలగించినట్లు ఆరోపించారు. పల్లె ప్రకృతి వనంలోని చెట్లను తొలగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని స్థానిక పంచాయతీ కార్యదర్శి పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. తొలగించిన వ్యక్తులను, జేసీబీ యంత్రాన్ని గుర్తించి చట్టప్రకారం శిక్షించాలని ఆమె ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్సై శ్రీనివాస్ బోరిగాం గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. చెట్లను తొలగించిన స్థలాన్ని ఎంపీడీవో రాధా రాథోడ్ శనివారం పరిశీలించారు. చెట్లను తొలగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెట్లను తొలగించిన స్థలంలో తన సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బోరిగాం తండా వాసులతో పాటు స్థానికులు ఉన్నారు.

యూరియా సమృద్ధిగా సరఫరా అయ్యేలా చూడండి

● మంత్రి తుమ్మలకు ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి విజ్ఞప్తి



మంత్రి తుమ్మలను కలిసిన మాజీ ఎమ్మెల్యేలు వేణుగోపాల చారి, విఠల్ రెడ్డి

భైంసా, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గ రైతాంగానికి సరిపడ యూరియా నిల్వలు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావ్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రిని కుభీర్ ఎంఎసీ చైర్మెన్ కళ్యాణ్‌తో కలిసి బేటి అయ్యారు. నియోజక వర్గ పరిధిలో నెలకొన్న ఎరువుల సమస్యను వివరంచారు. ప్రస్తుతం యూరియా, డీఏపీ అవసరమున్న దృష్ట్యా వాటి సరఫరా సకాలంలో అయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి అధికారులతో మాట్లాడి ఎరువుల సరఫరాకు చర్యలు తీసుకుంటానని వెల్లడించారు.ఈ సందర్భంలో కేంద్ర మాజీ మంత్రి, ముథోల్ మాజీ ఎమ్మెల్యే వేణుగోపాల చారి సైతం మంత్రి తుమ్మలను కలిసారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి బృందం మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి నియోజక వర్గానికి సంబంధించిన పలు సమస్యలను వివరించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో కుభీర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ కళ్యాణ్, మాజీ సర్పంచ్ విజయ్‌తో పాటు పలువురు ఉన్నారు.

శివారు కాలనీల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని వినతి

భైంసా, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని 4, 6 వార్డుల పరిధిలోని శివారు కాలనీల్లో నెలకొన్న సమస్యలను మున్సిపల్ అధికార యంత్రాంగం సత్వరమే పరిష్కరించాలని ఆ ప్రాంత వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంబంధిత విషయమై శనివారం బీజేపీ ముథోల్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు సాహెబ్‌రావు, బీజేవైఎం ముథోల్ అసెంబ్లీ కన్వీనర్ ముల్లావార్ అనిల్, పట్టణ ఉపాధ్యక్షులు వెంకటేష్, జనసేన ఉమ్మడి ప్రతినిధి సుంకెట మహేష్ బాబులు మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ, జనసేన ప్రతినిధులు మాట్లాడుతూ మున్సిపల్ అధికార యంత్రాంగం శివారు కాలనీల పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారం, అభివృద్ధి విషయంలో వివక్షత చూపుతుందని ఆరోపించారు. ఇక్కడి ప్రాంత ప్రగతిపై పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ అధికారులు ఇకనైన తీరు మార్చుకొని శివారు కాలనీల్లో మురికి కాలువలు, అంతర్గత రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అధ్వానస్థితికి చేరిన పారిశుధ్య వ్యవస్థను మెరుగుపర్చాలన్నారు. వీధి లైట్ల వ్యవస్థను పూర్తి స్థాయిలో సరి చేయాలన్నారు. లేని పక్షంలో శివారు కాలనీలతో కలిసి ఆందోళనలు చేపడుతామని వెల్లడించారు.

రాష్ట్ర వ్యవసాయ మంత్రిని కలిసిన కుభీర్ మార్కెట్ కమిటీ చైర్మన్

కుభీర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నూతనంగా ఎన్నికయిన కుభీర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కళ్యాణ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌ను మర్యాద పూర్వకంగా కలిసారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, కేంద్ర మంత్రి వేణుగోపాలచారితో కలిసి శనివారం హైదరాబాద్‌లోని బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆయనను కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కుభీర్ మాజీ సర్పంచ్ విజయ్, నాయకులు సాయినాథ్‌లున్నారు.

నర్సాపూర్(జి)లో ముదిరాజ్ సంఘం ఏకగ్రీవ ఎన్నిక

నర్సాపూర్(జి), జూలై 5 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్(జి) మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఎన్నికలుఏకగ్రీ వంగా జరిగాయి. నూతన కార్య వర్గంలో గడ్డం దేవేందర్ మరోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రచార అధికారిగా పీరటి మహేష్, క్యాషియర్‌గా తీగల కేశవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘానికి మార్గదర్శనం చేసే సలహాదారులుగా పీరాజీ, ఉమామహేశ్వర్, పాతర్ల గణేష్, పిట్ల సాయన్న, యాటకార్ల నవీన్, పిట్ల సతీష్‌లను ఎన్నుకున్నారు.

కడెం ఎస్సైని కలిసిన నాయకులు

కడెం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : కడెం ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్సై సాయికిరణ్‌ను బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నల్లజీవన్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఎస్సైని కలిసి అనం తరం శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ రఫీక్ అహ్మద్, నాయకులు రాజేశ్వర్ గౌడ్, ముబారక్ బిన్ మొహమ్మద్, గంగన్న, గంగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో భైంసా పీపీ ప్రత్యేక పూజలు

దిలావర్‌పూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాల్వ లక్ష్మీ నరసింహ స్వామిని భైంసా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరుణ రవీందర్ దంపతులు దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పీపీ అరుణ దంపతులను దేవస్థానం చైర్మన్ అంగూరి మహేందర్, ఈవో భూమయ్య శాలువాతో సత్కరించారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

సోన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాపూర్ గ్రామంలో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... సల్ల భోజవ్వ(54) కుమారుడు, కోడలు గత పది సంవత్సరాల నుంచి చిన్న చిన్న విషయాలకే గొడవ పడుతున్నారని, తన కోడలు తన కొడుకుతో గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయిందని తరచూ మనస్తాపం చెందిన భోజవ్వ ఈ నెల 4న సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని పురుగుల మందు తాగింది. మృతురాలి కొడుకు సల్ల నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది.

ఎమ్మెల్యేను సన్మానించిన విఠలేశ్వర ఆలయ కమిటీ సభ్యులు

ముథోల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : కుబీర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ఆక్రమణలు తొలగించినందుకు ఎన్నో సంవత్సరాల సమస్య తీరిందని తెలియజేస్తూ కుబీర్ విఠలేశ్వర ఆలయ కమిటీ సభ్యులు ముథోల్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను శనివారం సన్మానించారు. ఆసుపత్రి ముందు ఉన్న షెడ్ల వల్ల వర్షం పడితే వరద నీరంతా ఆలయంలోకి వచ్చేదన్నారు. ఎమ్మెల్యే, అధికారుల సహకారంతో 20 సంవత్సరాల కల నెరవేరిందని వారు పేర్కొన్నారు.

కౌన్సెలింగ్‌లో ఎలాంటి లోటుపాట్లు ఉండదు

●ఆర్జీయూకేటీలో అడ్మిషన్‌ల కౌన్సెలింగ్ సన్నాహక సమావేశం

● వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ దిశానిర్దేశం



సమావేశంలో పాల్గొన్న వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్, అధికారులు

బాసర,జూలై05(ఆంధ్రజ్యోతి) : ఆర్జీయూకేటీ బాసర, మహబూబ్‌నగర్ కేంద్రాల అడ్మిషన్‌ల కౌన్సెలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో శనివారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ ఎ. గోవర్ధన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కౌన్సెలింగ్ సౌకర్యవంతంగా సాగేందుకు విశ్వవిద్యాలయం అన్ని విభాగాలను సమన్వయం చేసిందని తెలిపారు. హెల్ప్‌డెస్కులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ నిరాటంకంగా సాగాలనే ఉద్దేశ్యంతో 20 ప్రత్యేక తరగతి గదుల్లో ఒక్కో గదికి 30 మంది విద్యార్థుల చొప్పున వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే బ్యాంక్ కౌంటర్స్, జిరాక్స్ కేంద్రాలు, ఫోటోగ్రఫీ తదితర అవసరాల కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ కెటగిరీలకు చెందిన విద్యార్థుల కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు సంబంధించిన శాఖల అధికారులకు కూడా పాల్గొనాల్సిందిగా ఆహ్వానించినట్లు తెలిపారు. ఒకవేళ ఏదైనా సమస్య తలెత్తినప్పుడు సంబంధిత అధికారులను సమాచారం ఇచ్చి తక్షణమే పరిష్కరించేందుకు అందరూ చొరవ చూపాలని వీసీ సూచించారు. ఈ కౌన్సెలింగ్ కార్యక్రమంలో 100 మందికి పైగా ఉద్యోగులు సేవలించానున్నారు. పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అడ్మిషన్‌ల కన్వీనర్ డా. చంద్రశేఖర్, కో కన్వీనర్ డా. దేవరాజు, బండి హరికృష్ణ, అడ్వైజరీ కమిటీ సభ్యులు, అడ్మిషన్‌ల బృందం పీఆర్వో డా విజయ్‌కుమార్‌ాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాలతో సమయం వృథా చేసుకోకండి

ఆర్జీయూకేటి బాసర అకాడమిక్ విభాగం ఆధ్వర్యంలో పీయూసీ టు విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమంలో శనివారం నిర్వహించారు. విద్యార్థులకు విశ్వవిద్యాలయ విద్యా విధానం, వనరులు, నైతిక విలువలు, సాంకేతిక విద్యలో అవసరమైన జ్ఞాన ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ప్రొ. గోవర్ధన్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్‌లు డా. విఠల్, డా. మహేశ్, డా. చంద్రశేఖర్‌లతో పాటు వివిద విభాగాల శాఖాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. చివరగా విద్యార్థుల సందేశాలను తీర్చేందు కుఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు.

'విజయవాణి పుస్తకాన్ని రచించడం అభినందనీయం'

భైంసా రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేగాం గ్రామానికి చెందిన బూత్ ఇన్‌చార్జి పాతర్ల నరేష్ విజయవాణి పుస్తకం రచించడం అభినందనీయమని బీజేపీ మండల అధ్యక్షురాలు సీరం సుష్మా రెడ్డి అన్నారు. దేగాంలోని జడ్పీ హైస్కూల్‌లో పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. సమాజానికి మంచి చెడు విలువలతో కూడిన పుస్తకాలను అందించడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భూమేష్, వీడీసీ చైర్మన్ లింగన్న, సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ ఎల్లప్ప, సెక్రటరీ భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

ఖానాపూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : శుక్రవారం సాయంత్రం విడుదలైన బాసర ట్రిపుల్ ఐటీ మొదటి జాబితాలో ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన కట్టికోల శ్రీవల్లి, జూజారే రాజు, సముద్రాల స్నిగ్ధ, మేడిపల్లి ఆదర్శిని, బక్కశెట్టి రోహిత్ రాజ్, మైలారం హర్షిణి, కొట్టే హర్షవర్ధన్, షేక్ రాహిల్, మైస నందినిలను శనివారం పాఠశాల ఆవరణలో మస్కాపూర్ వీడీసీ, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బొనగిరి నరేందర్ రావు మాట్లాడుతూ... బాసర ట్రిపుల్ ఐటీ మొదటి జాబితాలో నిర్మల్ జిల్లాకు చెందిన 34 మంది విద్యార్థులకు సీట్లు దక్కగా అందులో 9 సీట్లు మస్కాపూర్ విద్యార్థులకు రావడం అభినందనీయమన్నారు. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులు మరింత శ్రమించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు దొనికెని దయానంద్, గ్రామాభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు ఇనుముల స్వామి, కోశాధికారి రాచ లక్ష్మణ్, బొజ్జ వెంకటేష్, అడిదెల మహేందర్, అడిదెల మహిపాల్, అడ్వకేట్ బాశెట్టి శివ కుమార్, ఉపాధ్యక్షులు కుర్ర శేఖర్, వెన్నం అంజయ్య, జాడి శ్రీనివాస్, షేక్ ఇమ్రాన్, బాదోల్ల రవి, రాపర్తి కిషన్, సయ్యద్ ఫరాజ్‌లున్నారు.

తాంసి : మండలంలోని కప్పర్ల జిల్లా పరిషత్ పాఠశాల నుంచి బాసర ట్రిబుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థినులు ఎంపికయ్యారు. పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయిలో ర్యాంకులు సాధించిన వీరికి బాసర ట్రిబుల్ ఐటీలో చోటు దక్కింది. ఎంపికైన వారిలో కప్పర్ల గ్రామానికి చెందిన గిజ్జ అనుశ్రీ, నాయిని అర్చన, కడదారపు దివ్యలు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులతో పాటు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం సన్మానించారు. ప్రతి సంవత్సరం కప్పర్ల పాఠశాల నుంచి ముగ్గురేసి విద్యార్థులు ఎంపిక కావడం పట్ల మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారికి పాఠశాల ఉపాధ్యాయ బృందం తరపున శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు.

నార్నూర్ : మండల కేంద్రం మోడల్ స్కూల్ విద్యాభ్యాసం చేస్తున్న 10వ తరగతి విద్యార్థి జి.ఆకాష్ బాసర్ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. శనివారం విడుదలైనా తొలి విడుత ఫలితాల్లో ఎంపికయ్యారని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రశాంత్ పేర్కొన్నారు. ఆరేళ్ల పాటు బీటెక్ ఇంటిగ్రేటెడ్ కోర్స్ చేయనున్నట్లు తెలిపారు. సీటు సాధించడం పట్ల పలువురు ఆకాష్‌ను అభినందించారు.

బజార్‌హత్నూర్ : ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మెరిశారు. కాగా బజార్హత్నూర్ మండలంలోని మోడల్‌స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో చదువుతున్న దేగామకు చెందిన రీతిక, ఇచ్చోడకు చెందిన అక్షరతో పాటు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న భూతాయి చెందిన రాజ్‌కుమార్‌లు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ప్రేంకుమార్, భూమన్నలు తెలిపారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బోథ్ : సోనాల మండల కేంద్రంకు చెందిన ఇరువురు విద్యార్థులు బి.నాగమణి, ఆర్.స్వాతిలు బాసర ట్రిబుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఆదిలాబాద్ జిల్లాలో 35 మంది విద్యార్థులు ఎంపిక కాగా సోనాల నుంచి ఇద్దరు విద్యార్థులు ట్రిబుల్ ఐటీకి ఎంపిక కావడం పట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థి కుటుంబీకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'ముథోల్ అభివృద్ధే మా లక్ష్యం'



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

ముథోల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌ను అభివృద్ధి చేయడమే మా లక్ష్యమని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ముథోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన 18 నెలల్లో ఐదుసార్లు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశానన్నారు. పెండింగ్‌లో ఉన్న మిగతా చెక్కులను త్వరలో లబ్ధిదారులకు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు ఎల్లవేళలా ముందుంటానని పేర్కొన్నారు. ప్రజల పక్షాన ఉంటూ నియోజకవర్గాన్ని శాయశక్తులా అభివృద్ధి చేస్తానని అన్నారు. బ్రహ్మన్‌గావ్ లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతలకు రూ. 5 కోట్ల 80 లక్షల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. ఈ నిధులకు టెండర్ పూర్తయిన తర్వాత ఎత్తిపోతల మరమ్మతుల పనులు ప్రారంభం అవుతాయన్నారు. ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని ఆయన పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న 28 ప్యాకేజీ పనులు పునఃప్రారంభం అయ్యే విధంగా చూస్తానన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తి ప్రభుత్వం దృష్టికి తెస్తున్నానన్నారు. మరో మూడున్నర సంవత్సరం కాలంలో ముథోల్‌ను సస్యశ్యామలం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, ఆత్మ చైర్మన్ గన్ను నర్సారెడ్డి, తహసీల్దార్ శ్రీలత, నాయబ్ తహసీల్దార్ తెలంగ్ రావు, ఆర్ఐ నారాయణ రావు పటేల్, బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు గంట శ్రీనివాస్, విఠల్ రావు, నిమ్మ పోతన్న, దత్తాద్రి, రాంచందర్, సప్పటోల్ల పోతన్న, టి. రమేష్, లక్ష్మీనారాయణ, సంతోష్, మోహన్ యాదవ్, సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

భైంసా : అర్హులైన వారందరికి తప్పనిసరిగా రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు సూచించారు. శనివారం భైంసా నుంచి ఫోన్ ద్వారా జిల్లా పౌర శాఖ అధికారులతో మాట్లాడారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ లోపాలకు తావు లేకుండా చేపట్టాలన్నారు. అర్హులకు అన్యాయం జరిగితే సహించబోమని వెల్లడించారు. ఒత్తిడిలకు తలొగ్గి అనర్హులకు అందలం ఎక్కిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. జాప్యపు విధానాలకు తావు లేకుండా త్వరితగతిన రేషన్ కార్డుల జారీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇందులో భాగంగానే నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల వాసులు భైంసాలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే రామరావ్ పాటిల్‌ను కలిసి వివిధ సమస్యలను వివరించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత సమస్యలపై ఆయా శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు.

రోడ్లు ఇలా.. బండ్లు నడిపేదెలా..!?

ఫొటో న్యూస్

అదిలాబాద్ పట్టణంలోని ప్రధాన రహదారులు గుంతలమయంగా మారాయి. జనాల రాకపోకలు ఎక్కువగా ఉండే ప్రధాన వీధుల గుండా కనీసం నడిచే పరిస్థితి సైతం లేదు. పట్టణంలోని టీచర్స్ కాలనీ, కేఆర్‌కే కాలనీ, టైలర్స్ కాలనీ, మహాలక్ష్మి వాడ తదితర ప్రాంతాల్లో రోడ్లు అధ్వాన్నంగా మారాయి. తాజాగా కురిసిన వానలకు రహదారులు గుంతలమయంగా మారడంతో వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రధాన వీధుల గుండా వెళ్లాలంటేనే జంకుతుండడం పట్టణంలో రోడ్ల దుస్థితికి అద్దం పడుతోంది. గుంతల కారణంగా నిత్యం ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా తమ ఇబ్బందులను గుర్తించి అధికారులు, ప్రజా ప్రతినిధులు కొత్త రోడ్లు వేయాలని, కనీసం మరమ్మతుల పనులనైనా పూర్తి చేయాలని స్థానికులు కోరుతుండడం గమనార్హం.

● ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్


ఆదిలాబాద్‌లోని టైలర్స్ కాలనీ రోడ్డు దుస్థితి ఇలా..







ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీ రోడ్డు పరిస్థితి


టీచర్ కాలనీ రోడ్డుపై వాహనదారుల ఇబ్బందులు




మార్కెట్‌లో విక్రయిస్తున్న బోడ కాకర

బోడ కాకర.. కిలో రూ. 320

ముథోల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బోడ కాకరకు మార్కెట్‌లో భలే గిరాకీ ఉంది. ప్రస్తుతం కిలో బోడ కాకర రూ.320 పలుకుతుంది. అడవిలో లభించే ఈ బోడ కాకర వర్షాకాలంలో 2-3 నెలల్లో మాత్రమే లభ్యం అవుతుంది. దీనిలో అనేక పోషక విలువలతో పాటు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉండడంతో దీనిని కొనేందుకు భోజన ప్రియులు ఇష్టపడుతారు. అడవిలో లభ్యమయ్యే ఈ కాకర కాయను సేకరించి పట్టణాల్లో, పల్లెల్లో, మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. కిలో బోడ కాకర రూ. 320 నుంచి రూ. 350 పలకడంతో ధర ఎంత ఎక్కువ ఉన్న కొనేందుకు ఇష్టపడుతుంటారు. ఏదేమైనా ఈ అడవి కాకరకు గిరాకీ భలే ఉంది.

ముథోల్‌లో ఆధార్ కేంద్రం లేక ప్రజల అవస్థలు

ముథోల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముథోల్‌లో ఆధార్ సెంటర్ లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేశారు. అయితే ఆధార్ సెంటర్ 20 రోజుల నుంచి తెరుచుకోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రజలు ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు చేసుకోవడానికి భైంసా పట్టణానికి వెళ్లవలసి వస్తుంది. చిన్నారులు, వృద్ధులు స్థానికంగా ఆధార్ కేంద్రం లేక ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఆధార్ కార్డులో చిరునామా మార్పిడితో పాటు మారుపేరు, పేరు, ఫోన్ నెంబర్, పుట్టిన తేదీలో దొర్లిన తప్పులు సరిదిద్దుకోవడానికి ఆధార్ కేంద్రానికి వెళ్తున్నారు. అక్కడి ఆధార్ కేంద్రాల్లో వందల సంఖ్యలో ప్రజలు క్యూలో ఉండడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో ఆధార్ కేంద్రం లేక ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతం. ఆధార్ కేంద్రం ముథోల్‌లో మళ్లీ పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధార్ కార్డులోని తప్పులను సరిదిద్దుకోవడానికి అవకాశం ఉన్న ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా ఆధార్ సెంటర్‌ను పునరుద్ధరించడంతో ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే తప్పు ఒప్పులను సవరించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ప్రధాన రోడ్డుపై నిలుస్తున్న నీరు

● పాదాచారులకు తప్పని తిప్పలు


బోథ్ బస్టాండ్ పక్కన ఉన్న రోడ్డుపై నిలిచిన నీరు

బోథ్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలోని బస్టాండ్ పక్కన ఉన్న రోడ్డుపై వర్షపు నీరు నిలుస్తుంది. ఫలితంగా ఈ రూట్‌లో వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బస్టాండ్ చుట్టూ ప్రహారీ నిర్మించడం వల్ల కుడి వైపు ఉన్న రోడ్డు మార్గం ద్వారానే గ్రామస్థులు ప్రయాణించాల్సి వస్తుంది. రోడ్డుకు పక్కన వ్యాపారసంస్థలు ఉండటం వల్ల మురికి కాలువ నిర్మాణం తప్పనిసరి అవసరం అవుతుందని స్థానికులు అంటున్నారు. అధికారులు ఈ రోడ్డుపై నీరు నిల్వకుండా మురికి కాలువలను నిర్మించాల్సిన అవసరం ఉంది.

పంటల సాగుపై డిజిటల్ గణన

● పక్కా వివరాల నమోదుకు కసరత్తు ● దిగుబడుల విక్రయాల్లో తొలగనున్న ఇబ్బందులు

భైంసా, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పంటల సాగు వివరాలు నమోదు చేసేందుకు ఈ సారి నుంచి డిజిటల్ సర్వే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి దాకా అధికారులు క్షేత్ర పర్యటన చేసి రైతుల పట్టా పాసు పుస్తకాల ఆధారంగా పంటల సాగు గణన చేపట్టారు. కొన్ని పాసు పుస్తకాలలో విస్తీర్ణం తక్కువగా ఉండి, సాగు భూమి ఎక్కువగా ఉన్న సందర్భంలో వివరాల నమోదులో ఖచ్చితత్వం లోపించింది. అందుకే డిజిటల్ విధానం ద్వారా చేపట్టాలని నిర్ణయించినట్లు అధికారులు చెప్పారు. జిల్లాలో 1,88,052 మంది రైతులున్నారు. ఇందులో 1.4 లక్షల మందికి పైగా రైతులు సాగు కొనసాగిస్తున్నారు. వానకాలపు సీజన్‌లో జిల్లాలోని రైతాంగం దాదాపు 4.4లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఈ సారి వర్షాకాలంలో 4.15 లక్షల ఎకరాల్లో అన్నదాతలు పంటలు సాగు చేయనున్నారని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అయితే ఏ పంట ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేసేలా గణన చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం జిల్లాలోని అన్నీ ప్రాంతాల్లో ఆయా పంటల విత్తనాలు విత్తడం పూర్తవ్వగా పలు రకాల పంటలు మొలక దశను దాటిపోయాయి. ఈ క్రమంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పంటల వివరాలు పక్కగా నమోదు చేసే ప్రక్రియ కోసం గాను వ్యవసాయశాఖ అధికార యంత్రాంగం కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తోంది. క్షేత్రస్థాయిలో వ్యవసాయశాఖ విస్తీర్ణాధికారులు పంటల నమోదు నిర్వాహణకు సిద్ధమయ్యారు.


సాగులోనున్న వరి పైరు

● కొనుగోలులో ఇబ్బంది రాకుండా..

పంటలను ప్రభుత్వం మద్ధతు ధరకు కొనుగోలు చేసే సమయంలో సాగు విస్తీర్ణం వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తారు. ఈ సమయంలో ఖచ్చితమైన పంట విస్తీర్ణం లెక్కలు లేకపోవడంతో ఒక్కో సారి గందరగోళం నెలకొంటుంది. గ్రామాల్లో తక్కువ ధరకు వ్యవసాయ ఉత్పత్తులు కొని దళారీలు కొందరు ప్రభుత్వం అందించే మద్ధతు ధరను పొందుతున్నారు. రైతుకు అన్యాయం జరుగుతోంది. రైతు యూనిట్‌గా గణన వివరాలు నమోదు చేస్తే మార్కెట్ సీజన్‌లో ఇబ్బందులకు తావుండదని భావిస్తున్నారు.

పంటల సాగు విస్తీర్ణం అంచన వివరాలు ఇలా..

ప్రస్తుత వానకాలపు సీజన్‌లో జిల్లాలోని రైతాంగం 4.4 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేయనున్నారని వ్యవసాయాధికారులు అంచనా వేసారు. ఇందులో వరి 1.14 లక్షల ఎకరాలలో, పత్తి 1.25 లక్షల ఎకరాలలో, సోయా 1.20 లక్షల ఎకరాలలో, మొక్కజొన్న 28 వేల ఎకరాలలో, కందులు 7 వేల ఎకరాల్లో, పసుపు 6 వేల ఎకరాలలో, మిగతా 40 వేల ఎకరాలలో ఇతర అన్నీ రకాల పంటలు సాగు చేయనున్నారని అంచనా వేసారు.


సాగులోనున్న సోయా పైరు

కార్యచరణ ప్రణాళిక పూర్తి

అంజీ ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి, నిర్మల్

జిల్లాలో సాగులోనున్న పంటల వివరాల నమోదు ప్రక్రియ కోసం గాను కార్యచరణ ప్రణాళిక రూపొందించాం. వారం రోజుల వ్యవధిలోగా డిజిటల్ సర్వే ద్వారా పంటల నమోదును చేపడుతాం. లోపాలకు తావు లేకుండా సర్వే ప్రక్రియను పూర్తి చేస్తాం.

నేడు తొలి ఏకాదశి


శ్రీమహా విష్ణువు

ముథోల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నేడు (ఆదివారం) తొలి ఏకాదశి. దీన్ని హిందువులు తొలి పండుగగా పిలుస్తారు. తొలి ఏకాదశి పర్వదినానికి హైందవ సంస్కృతిలో విశేష స్థానం ఉంది. ఒక ఏడాదిలో వచ్చే 24 ఏకాదశిల్లో ఆషాడ శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశిగా పిలుస్తారు. దీనికి శయనేకాశి అని, హరివాసరమని పేర్లు ఉన్నాయి. పురాణాలను అనుసరించి శ్రీ మహావిష్ణువు క్షీర సాగరంలో శేష తల్పం మీద శయని స్తాడు. అలా నాలుగు నెలల పాటు ఆయన పడుకొని ప్రబోధిని ఏకాదశి నాడు తిరిగి మేల్కొంటాడు. ఈ నాలుగు నెలలను చతుర్మాసాలుగా వివరిస్తారు. ఈ రోజు నుంచి నాలుగు నెలల పాటు చతుర్మాస దీక్షను ఆచరిస్తారు. ఉత్తరాయణం కంటే దక్షిణాయనంలో పండుగలు పర్వదినాలు ఎక్కువగా వస్తాయి. వాతావరణంలో మార్పులు అధికంగా వస్తాయి. కనుక ఈ కాలంలో ఆరోగ్య పరిరక్షణ నియమాలు ఆచరించాలి. అందువల్ల మన పెద్దలు వ్రతాలు, పూజలు ఆచరించాలని చెబుతారు.

ఏకాదశి తిథి..

కృతయుగంలో మురాసుడనే రాక్షసుడు బ్రహ్మ వరంతో దేవతలను, రుషులను హింసించడంతో శ్రీమహా విష్ణువు అతనితో పోరాడి అలిసి పోయి గుహలో విశ్రాంతి తీసుకుంటుండగా శ్రీహరి శరీరం నుంచి ఓ కన్య ఆవిర్భవించి రాక్షసుడిని అంతం చేసిందట, ఇందుకు సంతోషించిన మహావిష్ణువు కన్యను వరం కోరుకోమనగా తాను విష్ణు ప్రియగా లోకం చేత పూజించబడాలని కోరుతుందట, అప్పటి నుంచి ఏకాదశి తిథిగా వ్యవహారంలోకి వచ్చింది. ఈ రోజు ఉపవాస దీక్షబూని భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. గ్రామాల్లోని స్థానిక ఆలయాల్లో పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు.




గోరింటాకు పెట్టుకున్న మహిళల చేతులు



గోరింటాకు పండింది.. ఆషాడంలో మెరిసింది

ముథోల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసం వచ్చిందంటే చాలా.. గోరింటాకు గుర్తుకు వస్తుంది. ఆషాడ మాసం గడిచేలోగా ఏదో ఒక రోజున గోరింటాకు పెట్టుకొని తీరతారు మహిళలు. జ్యేష్ఠ మాసంలో వర్షాలు కురవడం మెండుగా మొదలవుతాయి. అలా తరచూ వర్షపు నీటిలో నానక తప్పదు. ఇక పొలం పనులు చేసుకునేవారు.. ఈ కాలంలో కాళ్లు, చేతులను తడప కుండా రోజుని దాటలేరు. అలాంటి సమయంలో చర్మ వ్యాధులు రావడం, గోళ్లు దెబ్బతినడం సహజం. గోరింటాకు ఇలాంటివి కొన్ని రోజుల పాటు ఆపుతుందని వయోవృద్ధులు చెబుతున్నారు. ఆషాడ మాసం నాటికి గోరింట చెట్టు లేత ఆకులతో కళకళలాడుతూ ఉంటుంది. ఆ సమయంలో గోరింటాకు కోయడం వల్ల చెట్టుకి ఏమాత్రం హానీ కలుగదు. కాబట్టి పైగా లేత ఆకులతో చేతులు ఎర్రగా పండుతాయి. ఈ మాసంలో ఆషాడం నాటికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడిపోతుంది. వాతావర ణంలో అకస్మాత్తుగా వచ్చే ఈ మార్పు వల్ల శరీ రం లో కఫసంబంధమైన దోషాలు ఏర్పడతాయి. గోరిం టాకుకి ఒంట్లోని వేడిని తగ్గించే గుణం ఉంది. అలా బయట వాతావరణానికి అనుగుణంగా మన శరీరాన్ని కూడా చల్లబరిచి దోషాల బారిన పడకుండా చేస్తుంది. గోరింటాకుని పూర్వీకులు ఈ మాసంలో తప్పకుండా మహిళలు చేతులకు గోరింటాకు అద్దుకోవాలని సూచిస్తారు. అంతేకాకుండా ఆషాడంలో కొత్త పెళ్లి కూతుళ్లు తమ పుట్టింటికి చేరుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆ సమయంలో తమ చేతులకు పండించుకునే గోరింట వారికి తమ సౌభాగ్యాన్ని గుర్తు చేస్తుందని నమ్మకం. పుట్టింట ఉన్న మనసు, మెట్టినింట ఉన్న భర్త ఆరోగ్యాన్ని కాంక్షిస్తుంది. వేళ్లకి గోరింట పెట్టుకోవడం వల్ల కంటికి ఆరోగ్యమే కాకుండా గోళ్లు పెలుసు బారిపోకుండా, గోరుచుట్టు వంటి వ్యాధులు రాకుండా ఉంటాయట. గోరింటాకు లేకాదు.. పూలు, వేళ్ళ, బెరడు, విత్తనాలు... అన్ని ఔషధ యుక్తాలేనని పెద్దలు చెబుతున్నారు. గోరింట పొడిని మందుగా తీసుకోవడం, గోరింటతో కాచిన నూనెని వాడటం మన పెద్దల చిట్కా వైద్యంలో ఉన్నదే. కేవలం ఆషాడం కాదు. ప్రతీ శుభా కార్యాల సందర్భంలోను గోరింటాకు పెట్టుకోవాలని పెద్దలు సూచిస్తూ ఉంటరు. అలా ఏడాదికి కొన్నిసార్లు అయినా గోరింట అందించే ఆరోగ్యాన్ని అందుకోవాలన్నది పెద్ద ఉద్దేశం కావచ్చు. ఆషాడంలో గోరింట పెట్టుకోమన్నారు కదా అని చాలా మంది ఎక్కడ పడితే అక్కడ దొరికే కోన్ల మీద ఆధారపడుతూ ఉంటారు. గోరింట మన శరీరానికి తాకిన పుడు అందులో ఉండే లాసోన్‌ఖ అనే సహజమైన రసాయనం వల్ల ఎరుపు రంగు ఏర్పడుతుంది. కానీ చాలా రకాల కోన్లలో కృత్రిమంగా ఎరుపు రంగుని కలిగించే రసాయనాలు కలుపుతుంటారు. వీటి వల్ల ఆరోగ్యం మాట అటుం చితే అలెర్జీలు ఏర్పడే ప్రమాదం కూడా ఉంది. కాబట్టి ఆషాడంలో పుష్కలంగా లభించే గోరింటాకుని వాడుకునేందుకే ప్రాధాన్యతని ఇవ్వండి. రసాయనాలు కలిపిన గోరింటాకుకు దూరంగా ఉండాలి. సహజ సిద్ధంగా లభించే గోరింటాకును మాత్రమే ఉపయోగించాలి. పల్లెటూరిలో ఏ గట్టు చూసిన ఏ పొలం పక్క చూసిన రోడ్డుకు ఇరువైపులా గ్రామ చివరన గోరింటాకు చెట్లు పుష్కలంగా ఉంటాయి. ప్రకృతి సిద్ధంగా ఉన్న గోరింటాకు వాడినట్లయితే ఆరోగ్యంగా ఉంటుంది.

● సహజ సిద్ధ గోరింటాకులో ఔషధాలెన్నో!



మూల మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు!

● మలుపుల వద్ద పెరిగిన చెట్ల పొదలు
● సూచిక బోర్డులు లేక రాత్రివేళల్లో వాహనదారులు ఇబ్బందులు

బజార్‌హత్నూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బజార్‌హత్నూర్ మండలంలోని ఆర్‌అండ్‌బి ప్రధాన రహదారుల్లోని మూల మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా చెట్ల పొదతో నిండి ప్రమాదాలకు నెలవుగా మారాయి. ఈ మూల మలుపుల్లో ముళ్ల పొదలు, చెట్ల కొమ్మలు పెరిగాయి. అటు నుంచి వాహనాల రాకపోకలు ప్రతీరోజు సాగవుతుండడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గతంలో ఈ మలుపుల్లో ఎన్నో ప్రమాదాలతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏ క్షణాన ఏమి జరుగుతుందోననే భయం భయంతో వాహనాలు నడుపుతున్నారు. ముఖ్యంగా మండల కేంద్రం నుంచి మోర్ఖండి - దేగామకు వెళ్లే దారిలో చెట్ల పొదలు పెరిగి ప్రమాదకరంగా మారాయి. పొదల చాటున ప్రమాదాలు చోటు చేసుకునే కంటే ముందు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని వాహన దారులు కోరుతున్నారు. మలుపుల వద్ద వాహనదారులకు తెలిసేలా సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని వాహన దారులు కోరుతున్నారు. మూల మలు పుల్లో సూచిక బోర్డులు లేక రాత్రి వేళల్లో తరచు ప్రమాదాలు చోటు చరేసుకుంటున్నాయని గ్రామీణులు వాపోతున్నారు. ముఖ్యంగా దేగామ క్రాస్‌రోడ్డు నుంచి మోర్ఖండి వరకు చింతల సాంగ్వి, గోకొండ సమీపం లోని మలుపులు అలాగే సర్పంచ్ గూడ, ధరంపూరి, టెంబి, బోస్ర, రాంపూర్ దగ్గర శ్రీరాంనగర్ గ్రామాల సమీపం లోని మూలమలుపుల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చే యాల ని వాహన దారులు కోరుతున్నారు. ఈ మలుపుల్లో బోర్డులు, రోడ్ల పక్కన కొత్తస్టిక్కర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని మండల వాసులు కోరుతున్నారు.



జాతర్ల మూలమలుపు వద్ద రోడ్డుపై సగం వరకు చేరుకున్న ముళ్ల పొదలు


జాతర్ల మలుపు వద్ద ఏర్పాటు చేయని సూచిక బోర్డు


దేగామకు వెళ్లే రహదారి పై కనిపించని సూచిక బోర్డు

గడ్డెన్న వాగు ప్రాజెక్టులోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

● 355.7 మీటర్లకు చేరుకున్న నీటి మట్టం


గడ్డెన్న వాగు ప్రాజెక్టు

భైంసా, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతం మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల మూలంగా గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. మూడు రోజులుగా ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 324 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. మూడు రోజుల క్రితం ప్రాజెక్ట్ నీటి మట్టం 355.5 ఉండగా గురువారం నాటికి నీటి మట్టం 355.7 మీటర్లకు చేరుకుంది. ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో ప్రాజెక్టు నీటి రోజుకు 0.1 మీటర్ చొప్పున పెరుగుతూ పోతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 358.7 మీటర్లు ఉండగా ప్రస్తుత నీటి మట్టం 355.7 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టు గరిష్ట నీటి నిల్వ 1.852 టీఎంసీలు ఉండగా ప్ర స్తుత నీటి నిల్వ 0.512 టీఎంసీలు ఉన్నాయి. ఇన్‌ఫ్లో కొన సాగుతుండటంతో ప్రాజెక్టు నీటి మట్టం మరింతగా పెరిగే అవకాశం ఉంది.


గడ్డెన్న వాగు ప్రాజెక్టు నీటి నిల్వలు

యూరియా కోసం తప్పని తిప్పలు


సోనాలలో యూరియా బస్తాల కోసం ఎదురుచూస్తున్న రైతులు

బోథ్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి బోథ్ మండలంలో ఎరువుల కొరత అధికంగా ఉంది. దీంతో రైతులు యూరియా కోసం ఎదురు చూడక తప్పడం లేదు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం యూరియా బస్తాలు వచ్చాయని తెలియడంతో రైతులు క్యూలైన్‌లో నిలబడి యూరియా బస్తాలు తీసుకున్నారు. కాగా.. ఎరువు కొరత దృష్ట్యా అధికారులు మండలానికి మరిన్ని ఎరువుల బస్తాలు తెప్పించి.. కొరత తీర్చాలని రైతులు కోరుతున్నారు.

రైతుల వివరాల నమోదును వేగవంతం చేయండి

కుంటాల, జూలై, 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం నూత నంగా ప్రవేశపెట్టిన రైతుల వివరాల నమోదు (ఫార్మర్ రిజి స్ట్రేషన్) ప్రక్రియను వేగవంతం చేయాలని ఏడీఏ వీణ అన్నా రు. శనివారం మండల కేంద్రం కుంటాల స్థానిక రైతు వేదికలో వ్యవసాయశాఖ సిబ్బంది చేపడుతున్న రైతుల వివరాల నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. వివ రాల నమోదులో అలసత్వం వహించకూడదన్నారు. కార్యక్రమంలో వ్యవసా యాధికారి విక్రమ్, సిబ్బంది ఉన్నారు.

రైస్‌మిల్లుల్లో తనిఖీలు



రైస్‌మిల్లుకు ధాన్యం తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

- సీఎంఆర్ బకాయిలపై ఆరా
- 2024-2025 ఖరీఫ్, రబీ సీజన్ ధాన్యం లెక్కలు తేలుస్తున్న అధికారులు
- ఇప్పటి వరకు ఐదు రైస్‌మిల్లుల్లో తనిఖీలు పూర్తి
- ప్రస్తుతం భైంసా డివిజన్ రైస్‌మిల్లుల్లో కొనసాగుతున్న వెరిఫికేషన్
- ఎఫ్‌సీఐ, పౌర సరఫరాల శాఖ అధికారుల సంయుక్త దర్యాప్తు
- వివరాలు వెల్లడించని అధికారులు

నిర్మల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో 2024-2025 ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించిన సీఎంఆర్ ధాన్యం లెక్కలను సంబంధిత యంత్రాంగం నిగ్గు తేలుస్తోంది. ముఖ్యంగా ధాన్యం మిల్లింగ్ చేయకుండా సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి ఇవ్వని రైస్ మిల్లులపై అధికార యంత్రాంగం కొరఢా ఝులిపించేందుకు సిద్ధమవుతోంది. దీని కోసం గానూ అన్ని రైస్‌మిల్లుల వారీగా పౌర సరఫరాల శాఖ ఎఫ్‌సీఐ అధికారులు సంయుక్తంగా ఫిజికల్ వెరిఫికేషన్ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ఇప్పటికే నిర్మల్ డివిజన్‌లోని ఐదు రైస్‌మిల్లుల్లో ఫిజికల్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. ప్రస్తుతం అధికారులు భైంసా డివిజన్‌లోని రైస్‌మిల్లుల్లో ఫిజికల్ వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. అయితే దాదాపు అన్ని రైస్‌మిల్లులు 2024-2025 ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించిన సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి ఇవ్వలేదన్న ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో కోట్లాది రూపాయలు చేతులు మారాయన్న ఫిర్యాదులు వచ్చాయి. కొద్ది రోజుల క్రితం అధికారులు తనిఖీలు నిర్వహించి రెండు రైస్‌మిల్లులను సీజ్ చేశారు. అలాగే కేసులు సైతం నమోదు చేశారు. అయినప్పటికీ సీఎంఆర్ రికవరీ విషయంలో పెద్దగా స్పందన కనిపించలేదు. రాజకీయ అండదండలు పుష్కలంగా ఉన్న రైస్‌మిల్లు యాజమాన్యాలు భారీ ఎత్తున సీఎంఆర్ బియ్యాన్ని దారి మళ్లించాయన్న ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించినప్పటికీ రైస్‌మిల్లు యాజమాన్యాల తీరులో మార్పు రాలేదు. మొదటి నుంచి సీఎంఆర్ ధాన్యం మిల్లింగ్ విషయంలోనూ, మిల్లింగ్ అయిన బియ్యాన్ని తిరిగి ఇచ్చే విషయంలోనూ రైస్‌మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సంగతి బహిరంగ రహస్యమే. రాజకీయ అండదండలతో రైస్‌మిల్లర్లు అధికారుల హెచ్చరికలను సైతం బేఖాతరు చేయడమే కాకుండా ధాన్యాన్ని పక్కదోవ పట్టించినట్లు చెబుతున్నారు. అయితే ధాన్యం నిల్వలను మాయం చేసి తప్పుడు లెక్కలతో అధికారుల కళ్లకు మిల్లర్ల సిండికేట్ గంతలు కట్టారన్న వాదనలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రైస్‌మిల్లుల్లో ఫిజికల్ వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేసింది. దీనికి అనుగుణంగా సంబంధిత అధికారులు ఫిజికల్ వెరిఫికేషన్ ప్రక్రియను మొదలు పెట్టారు. ఈ వెరిఫికేషన్ అనంతరం సంబంధిత అధికారులు నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి పంపనున్నారు. ఈ ఫిజికల్ వెరిఫికేషన్ అనంతరం వెల్లడయ్యే అవకతవకలపై అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

ఖరీఫ్ సీఎంఆర్‌పైనే దృష్టి

కాగా 2024-2025 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ ధాన్యంపైనే ఫిజికల్ వెరిఫికేషన్‌లో ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ సీజన్‌కు సంబంధించి 1లక్ష 14వేల 185 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్‌మిల్లర్లకు సీఎంఆర్ కోసం కేటాయించారు. అయితే ఈ మొత్తం ధాన్యానికి సంబంధించి 76,504 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి అందించాల్సి ఉంది. దాదాపు ఏడాది కాలం గడిచినప్పటికీ ఇప్పటి వరకు రైస్‌మిల్లర్లు కేవలం 23,916 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే సీఎంఆర్ కింద ప్రభుత్వానికి అందించారు. ఇంకా 52,587 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి ఇవ్వాలి ఉంది. అయితే కొద్ది రోజుల క్రితం ప్రభుత్వం 2024-2025 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన బియ్యాన్ని గత మే నెల 31వ తేదీలోగా చెల్లించాలని గడువు విధించింది. గడువు విధించి నెల రోజులు గడిచినా ఇప్పటి వరకు సీఎంఆర్ బియ్యాన్ని చెల్లించడంలో రైస్‌మిల్లర్లు ఉద్దేశపూర్వకంగా చేతులెత్తేశారు. సంబంధిత అధికారులు ఎన్నిసార్లు హెచ్చరికలు జారీ చేసినా మిల్లర్లు మాత్రం యదావిధిగా మొండితనంతో వ్యవహరిస్తూ నిర్లక్ష్య ధోణిని అవలంబిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

రబీ సీజన్‌దీ అదే పరిస్థితి

2024-2025 రబీ సీజన్‌కు సంబంధించి కూడా రైస్‌మిల్లర్లు సీఎంఆర్ విషయంలో తమ నిర్లక్ష్య వైఖరిని యదావిధిగా కొనసాగిస్తున్నారు. ఈ సీజన్‌కు సంబంధించి 1లక్ష 53వేల 883 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ కోసం రైస్ మిల్లులకు కేటాయించారు. దీనికి గానూ రైస్‌మిల్లర్లు 1లక్ష 03వేల 101 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీఎంఆర్ కింద తిరిగి ఇవ్వాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు కేవలం 4,900 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని మాత్రమే మిల్లర్లు తిరిగి ఇచ్చారు. ఇంకా 98,200 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి చెల్లించాల్సి ఉంది. అయితే ప్రభుత్వం ఈ బియ్యం చెల్లింపునకు సెప్టెంబరు చివరి వరకు గడువు విధించింది. రెండు నెలల్లోగా దాదాపు 98వేల మెట్రిక్ టన్నుల బియ్యంను మిల్లర్లు ఎలా చెల్లిస్తారోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇప్పటి వరకు ఖరీఫ్ సంబంధించిన 52వేల మెట్రిక్ టన్నులకు పైగా బియ్యాన్ని తిరిగి చెల్లించని అధికారులు ఇక రబీ సీజన్‌కు సంబంధించిన బియ్యాన్ని ఎలా తిరిగి అప్పజెప్పుతారనేనన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

రాజకీయ అండదండలతోనే..

ఇదిలా ఉండగా చాలా మంది రైస్‌మిల్లర్లు తమకున్న రాజకీయ పలుకుబడి పరపతితో అధికారులపై ఒత్తిడిలు తీసుకువచ్చి సీఎంఆర్ విషయంలో భారీ ఎత్తున అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత నాలుగైదు సంవత్సరాల నుంచి రైస్ మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఉన్నతాధికారుల హెచ్చరికలను సైతం బేఖాతరు చేయడం వెనక రాజకీయ హస్తమే కారణమన్న ఆరోపణలు బహిరంగంగా వ్యక్తమవుతున్నాయి. అయితే ముథోల్ ప్రాంతానికి చెందిన కొంత మంది రైస్‌మిల్లర్లకు అక్కడి ఓ మాజీ ప్రజా ప్రతినిధి బహిరంగంగానే మద్దతునిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ప్రస్తుతం జరుగుతున్న ఫిజికల్ వెరిఫికేషన్ విషయంలో కూడా రాజకీయ ఒత్తిళ్లు ఏర్పడే అవకాశం ఉందన్న వాదనలు తెరపైకి వస్తున్నాయి. అధికారులు తమ వంతు విధులను పకడ్బందీగా నిర్వహిస్తున్నప్పటికీ వారి విధులకు రాజకీయ ఒత్తిళ్లు ఆటంకాలు సృష్టిస్తున్నాయని అంటున్నారు.

స్వచ్ఛత - పచ్చదనం - ఆరోగ్యంపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

నిర్మల్ చైన్‌గేట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో శానిటేషన్, మిషన్ భగీరథ, వన మహోత్సవం, సీజనల్ వ్యాధుల నివారణ వంటి కీలక అంశాలపై సమగ్రంగా సమీక్షిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రతి ఇంటికి నాణ్యమైన తాగునీరు అందించేందుకు మిషన్ భగీరథను మరింత సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఎక్కడైనా నీటి సరఫరాలో ఆటం కం ఉంటే వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శానిటే షన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతి గ్రామంలో శుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తడి, పొడి చెత్త వేరు చేసి శాస్త్రీయంగా నిర్వహించాలన్నారు. వన మహోత్సవాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఒక వ్యక్తి - ఒక మొక్క అనే నినాదంతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ... జిల్లాలో నీటి సరఫరా, శానిటేషన్, మొక్కల నాటింపు కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. ప్రజల భాగస్వా మ్యంతో అభివృద్ధి లక్ష్యాలు సాధిస్తామన్నారు. వీడియోకాన్ఫరెన్స్ అనంతరం అదనపు కలెక్టర్ అధికారులతో సమీక్షిస్తూ, మిషన్ భగరథ పనుల పురోగతిపై ప్రతివారం నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతిగ్రామంలో శానిటేషన్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని, మొక్కల సంరక్షణకు గ్రామస్థాయిలో బాధ్యతలు అప్పగించాలన్నారు. పరిశుభ్రత, మంచి నీటి వినియోగం, పచ్చదనం పెంపుతో ప్రజలు ఆరోగ్యంగా ఉండగలరని పేర్కొన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో గోవింద్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, డీఆర్డీవో నాగవర్ధన్, అధికారులు పాల్గొన్నారు.

యూరియా అధిక మోతాదులో వాడొద్దు

- జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్



అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్

సోన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో రైతులకు యూరియా వాడకంపైన జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ అవగాహన కల్పించారు. రైతులు నానో యూరియా, నానోడాప్ వాడటం మంచిదని తెలిపారు. రైతులు భూసారపరీక్షలు చేసుకొని తగిన మొతాదులో యూరియాని వాడాలని తెలిపారు. అలాగే రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రాజమల్లు, ఏవో వినోద్, ఏఈవో ఉమా, పంచాయతీ సెక్రటరీ భూపాల్, నాయకులు గంగన్న, రైతులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో చొరబడిన పాము

ఖానాపూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని గోదావరి నది తీరంలో గల ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోకి శనివారం ఓ పాము చొరబడింది. ఇది గమనించిన రైతులు ఎంజాల భూమేష్, సుతారి బక్కన్నలు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేసి ఆ పామును బయటకి తొలగించారు. అప్పటికే పాము చనిపోయింది. వర్షాలు కురుస్తున్న వేళ కరెంటు మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లే రైతులు కరెంటు తోనే కాకుండా విష సర్పాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

బాసర పుణ్యక్షేత్ర అభివృద్ధిపై రివ్యూ

- దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి అధ్యక్షతన హైదరాబాద్‌లో సమావేశం
- హాజరైన ఆలయ అధికారులు



ఆహ్వానపత్రికను అందజేస్తున్న బాసర దేవస్థానం అధికారులు

బాసర, జూలై 5(ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బాసర సరస్వతీ అమ్మవారి ఆలయ మాస్టర్‌ప్లాన్ అమలుపై దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజ రామయ్యర్ అధ్యక్షతన రివ్యూ మీటింగ్ నిర్వహించారు. హైదరాబాద్‌లోని చేనేత భవనంలో జరిగిన ఈ సమావేశానికి దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజరామయ్యర్‌తో పాటు కమిషనర్ వెంకటరావు ఇతర ప్రముఖులు హాజరయ్యారు. బాసరలో ప్రస్తుత పరిస్థితి భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలు అత్యవసరంగా చేపట్టాల్సిన పనుల గురించి ఆలయ ఈవో సుధాకర్‌రెడ్డి ఏఈవో సుదర్శన్‌గౌడ్ వివరించారు. ప్రభుత్వ నిధులతో పాటు కోట్ల ఆర్థిక సాయం అందించేందుకు దాతలు కూడా సిద్ధంగా ఉన్నట్లు ఆలయ అధికారులు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 42 కోట్ల నిధుల గురించి కార్యదర్శి దృష్టికి మరోసారి తెచ్చారు. మొదటి దశలో అమ్మవారి ఆలయ విస్తరణ క్యూ కాంప్లెక్స్ నిర్మించేలా చర్చకు వచ్చింది. పనులు చేపడితే పుష్కరాలలోగా అవుతాయా అనే సందేహం వ్యక్తంగా చేయగా.. ప్రభుత్వం అనుమతులు మంజూరు చేస్తే.. 2027 లోగా పనులు పూర్తిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు దేవాదాయశాఖ ఇంజనీరింగ్ అధికారులు స్పష్టం చేసినట్లు తెలిసింది. మొదటి దశ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్య కార్యదర్శి ఆదేశించినట్లు సమాచారం. ఈ నెల రెండోవారంలో బాసర పర్యటనకు రానున్న మంత్రి కొండా సురేఖ ఆలయం వద్ద నిర్మించిన వంద గదుల భక్తుల వసతి సత్రాన్ని, పరిపాలన కార్యాలయ భవనాన్ని ప్రారంభించనున్నారు. ప్రభుత్వం వెనక్కి తీసుకున్నా 42 కోట్ల గురించి ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కతో కూడా దేవాదాయ శాఖ రాష్ట్రస్థాయి అధికారులు చర్చించినట్లు తెలిసింది. మంత్రి బాసర పర్యటన వరకు ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు, పనులు ప్రారంభించే సమయం వంటివి స్పష్టం కానున్నాయి. మొత్తానికి చాలారోజుల తర్వాత కొత్తగా ఏర్పడ్డాయి. ప్రభుత్వం బాసర అభివృద్ధి గురించి రివ్యూ మీటింగ్ పెట్టడం బాసరకు శుభసూచకమని పలువురు అన్నారు. అన్ని అనుకూలిస్తే.. అతి త్వరలో అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. సమావేశంలో దేవాదాయశాఖ రాష్ట్ర ఉన్నత అధికారులతో పాటు ఎండోమెంట్ అడ్వైజర్ గోవిందా హరి, బాసర ఆలయ వైదిక సిబ్బంది ప్రవీణ్‌పాఠక్, సంజీవ్ మహరాజ్ ఉన్నారు.

బాసర క్షేత్రాన్ని అభివృద్ధి చేయాల్సిందే!

- త్వరలో 30 పడకల ఆసుపత్రి, లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభం
- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్




బాసర కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

బాసర, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : గత, ప్రస్తుత ప్రభుత్వాలు బాసర ఆలయాభివృద్ధి విషయంలో చిన్నచూపు చూస్తున్నాయని, రూ.42 కోట్ల నిధులు తక్షణమే విడుదల చేయాలని, ఆలయ పునర్నిర్మాణం చేపట్టే వరకు ఊరుకునే ప్రసక్తేలేదని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. శనివారం బాసర తహసీల్దార్ కార్యాలయంలో 36 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలయ పునర్నిర్మాణం చేపట్టకపోతే వచ్చే దసరా, దీపావళి రోజుల్లో నిరాహార దీక్షకు పూనుకుంటానని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 2027 జూన్‌లో గోదావరి పుష్కరాలు వస్తున్నాయని కోట్లాది భక్తులు వస్తున్నందున ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వెనక్కి మళ్లిన నలభై రెండు కోట్ల నిధులను తక్షణమే ఇవ్వాలన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల బాసర అభివృద్ధికి నోచుకోలేదని, అడెల్లిలో 50 కోట్లతో ఆలయ నిర్మాణం పూర్తయిన విషయాన్ని గుర్తుచేశారు. అదే విధంగా రైతాంగ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని బాసర లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్‌లు, కాలువలు మరమ్మతులు చేపట్టడంతో గతం కంటే భిన్నంగా 1600 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్‌కు త్వరలో కోటి 12 లక్షల నిధులు మంజూరు కానున్నాయని టెండర్‌లు వేసి పనులు చేపడతామని చెప్పారు. ఈ విషయంలో ఉత్తంకుమార్‌కు పలుమార్లు కలిశామన్నారు. రూ. 4 కోట్లతో అమ్మవారి క్షేత్రంలో 30 పడకల ఆసుపత్రిని కడతామన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో బాసర రైల్వే స్టేషన్‌ను ఆధునీకరించామని, వచ్చే సంవత్సరం వరకు డబుల్ లైన్ పూర్తి చేస్తామన్నారు. వందేమాతరం ఎక్స్‌ప్రెస్ బాసర నుంచి వెళ్లే విధంగా కేంద్ర ప్రభుత్వానికి విన్నవించినట్లు చెప్పారు. అదేవిధంగా వచ్చే సంవత్సరం కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించి తీరుతామన్నారు. త్వరలో బాసరకు 100 గదుల ఆధునీకరణ పూర్తయిన సందర్భంగా శాఖ మంత్రి కొండా సురేఖ రానున్నారని, ఆలయానికి సంబంధించిన పలు సమస్యలను చెబుతామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పవనచంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్, బీజేపీ మండల అధ్యక్షులు సాయినాథ్‌పటేల్, బీజేపీ నాయకులున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



మొక్కలు నాటుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

సారంగాపూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం మండలంలోని చించోలి(బీ)లో వనమహోత్సవాన్ని పురస్కరించుకొని సామూహికంగా మొక్కలు నాటి ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని, మొక్కలు నాటడమే కాకుండా నాటిన మొక్కలను పరిరక్షించడంలోను ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని పేర్కొన్నారు. మొక్కల సంరక్షణ కోసం ట్రీగార్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో లక్ష్మీకాంతం, అధికారులు ప్రజలున్నారు.

నిర్మల్ టౌన్ : పర్యావరణ పరిరక్షణ బాధ్యత మనందరిదని, మొక్కలు నాటి పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. వన మహో త్సవం కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు శనివారం నిర్మల్ పట్టణంలోని దివ్యనగర్ పార్క్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిం చారు. కార్యక్రమంలో పాఠశాలల విద్యార్థులు, మహిళలు, కాలనీవాసులతో కలిసి జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి పి.రామారావు, నిర్మల్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, భైంసా మున్సిపల్ కమిషనర్ రాజేష్‌కుమార్, మెప్మా పీడీ సుభాష్ పాల్గొన్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయండి

కుంటాల : వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని డీఎల్‌పీవో సుదర్శన్ అన్నారు. శనివారం మండల కేంద్రం కుంటాలతో పాటు ఆయా గ్రామాలలో మొక్కలు నాటారు. మొక్కల పెంపకం వలన వాతారణంలో కాలుష్యం నివారించడమే కాకుండా వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని మానవ మనుగడకు మొక్కలు ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరు ఇంటి ముందు మొక్కలు నాటి, నాటిన మొక్కలను సంరక్షిస్తే రాబోయే రోజుల్లో పచ్చదనం విరజిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈయన వెంట ఎంపీడీవో లింబాద్రి, ఏపీవో రహీం తదితరులు ఉన్నారు.



కుంటాలలో మొక్కలు నాటుతున్న డీఎల్‌పీవో

పెండింగ్ దరఖాస్తులను త్వరగా పూర్తిచేయాలి

- అడిషనల్ కలెక్టర్ కిషోర్‌కుమార్



రికార్డులను తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్ కిషోర్‌కుమార్

మామడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : భూ భారతిలో దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరగా పూర్తిచేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ కిషోర్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో గల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మండలంలో రెవెన్యూ సమస్యలు ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాస్ రావును ఎన్ని అప్లికేషన్లు వచ్చాయి, ఎన్ని పరిష్కరించారని అడిగి తెలుసుకున్నారు. మొత్తం 1616 దరఖాస్తులు రాగా అందులో నుంచి తహసీల్దార్‌కు సంబంధించినవి 113 రాగా అందులో 60 పరిష్కరించామని, మిగతా వాటిని కూడా త్వరగా పూర్తిచేస్తానని తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ... రెవెన్యూ సర్టిఫికెట్లు, రేషన్‌కార్డుల సమస్యలు తొందరగా పూర్తిచేయాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, జవాబుదారిగా అధికారులు పనిచేయాలని సూచించారు. వర్షాకాలం వర్షాల కారణంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చెరువులపై, గోదావరిపై దృష్టిసారించాలని, ప్రజలు అటు వైపు వెళ్లకుండా సూచనలు చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న పీడీ

ముథోల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం అయ్యేలా చూడాలని హౌసింగ్ పీడీ రాజేశ్వర్ కోరారు. శనివారం మండల కేంద్రమైన ముథోల్‌లోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నిబంధనల ప్రకారం జరిగితే లబ్ధిదారులకు ఆర్థికభారం ఉండదని, నిబంధనల ప్రకారమే ఇళ్ల నిర్మాణాలు చేసుకోవాలని సూచించారు. ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో ఎలాంటి అవకతవకలు జరుగకుండా పారదర్శకంగా నిర్మించేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈఈ దయానంద్, ఎంపీడీవో శివకుమార్, ఏఈ శ్రీకాంత్, ఈవో అన్వర్, తదితరులున్నారు.

ఆసుపత్రి తనిఖీ



కుంటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

కుంటాల, జూలై, 5 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని కుంటాల స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శనివారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సందర్భంగా వ్యాధులు వ్యాపించే అవకా శం ఉందని వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, నియంత్రణ చర్య లు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరమ్మతులకు సంబంధించి పనులను పంచాయతీ రాజ్ ఏఈతో కలిసి పరిశీలించారు. మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారైనా సహించబోమన్నారు